క్లుప్తంగా

విద్యాసామగ్రి వితరణ



విద్యార్థులకు విద్యాసామగ్రి అందిస్తున్న దాత చంద్రయ్య

విజయపురం (నగరి): మండలంలో ఇష్టకామేశ్వరపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు చంద్రయ్య గురువారం విద్యాసామగ్రిని వితరణ చేశారు. ప్రధానోపాధ్యాయుడు ఉదయ్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేతుల మీదుగా విద్యార్థులకు నోటుపుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు తదితర వాటిని అందించారు. కార్యక్రమంలో నాయకులు పాండియన్, భరత్, రేఖ, జిల్‌దాస్ పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తులు

వెదురుకుప్పం: మండల కేంద్రంలోని పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ)లో ఖాళీగా ఉన్న వివిధ ట్రేడ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ భైరవుడు గురువారం తెలిపారు. నాలుగో విడత జరుగుతున్న అడ్మిషన్లకు సంబంధించి 19వ తేదీ 11.59 గంటల లోపు ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. 20న దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని, 22న జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. వివరాలకు 9533723022, 9492571731 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

దేశాభివృద్ధిలో ఎల్ఐసీ కీలకం



బహుమతులు ఇస్తున్న బ్రాంచ్ మేనేజర్ భాను

పుత్తూరు రూరల్: దేశాభివృద్ధిలో ఎల్ఐసీ సంస్థ కీలకపాత్ర పోషిస్తోందని స్థానిక బ్రాంచ్ మేనేజర్ పి.భాను తెలిపారు. గురువారం బీమా వారోత్సవాల ముగింపు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఖాతాదారులకు మెరుగైన సేవలందిస్తున్న సంస్థల్లో ఎల్ఐసీ అగ్రగామి అన్నారు. ఏటా బీమా వారోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏబీఎం అజయ్‌బాబు, ఉద్యోగులు, ఏజెంట్లు, పాలసీదారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యం



విద్యార్థులకు ఐరన్ మాత్రలు వేస్తున్న సూపర్‌వైజర్

పాలసముద్రం: వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే ఆరోగ్యంగా ఉంటామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీల తెలిపారు. గురువారం శ్రీకావేరి రాజుపురం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు హెచ్ఎం శ్యామలమ్మ, ఎంఎల్‌హెచ్‌ఓ సునీతతో కలిసి విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు తప్పనిసరిగా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. డైటింగ్ పేరుతో చాలామంది విద్యార్థులు అతి తక్కువగా తిండి తిని బలహీనతకు గురవుతుంటారని తెలిపారు. అటువంటి వారు మంచి పోషకాహారం తీసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి కచ్చితంగా ఐరన్ మాత్రలను వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ గాలి మహేష్ బాబు, ఏఎన్ఎం రేవతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అభ్యసనా సామగ్రి పంపిణీ



అభ్యసనా సామగ్రిని అందజేస్తున్న టీచర్ లీలావతి

వెదురుకుప్పం: మండలంలోని దేవళంపేట ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు గురువారం అదే స్కూల్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు లీలావతి అభ్యసనా సామగ్రితో పాటు ప్లేట్లు వితరణ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం పేద విద్యార్థులకు అనేక ప్రోత్సాహకాలను అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందించే ప్రోత్సాహంతో పాటు తనవంతు కూడా విద్యార్థులకు సహకారం అందించాలన్న ఉద్దేశంతో ఈ అభ్యసనా సామగ్రిని వితరణ చేసినట్లు చెప్పారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. భవిష్యత్‌లో పేద విద్యార్థుల కోసం మరిన్ని సహాయ సహకారాలు అందిస్తానని చెప్పారు. కార్యక్రమంలో సీఆర్పీ సురేష్, జెడ్పీ హైస్కూల్ విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ ఉమాపతి పాల్గొన్నారు.

జయకృష్ణా.. ముకుందా.. మురారి..

- వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



పుత్తూరులో కల్పవృక్ష వాహనంపై విహరిస్తున్న రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణుడు

పుత్తూరు రూరల్: రుక్మిణీ సత్యభామ సమేతంగా శ్రీకృష్ణుడు కల్పవృక్ష వాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. గురువారం కృష్ణాష్టమిని పురస్కరించుకుని స్థానిక శ్రీద్రౌపదీదేవి సమేత శ్రీధర్మరాజస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి 7 గంటలకు రుక్మిణీ సత్యభామ శ్రీకృష్ణుడి ఉత్సవ మూర్తులను పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళ భరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి కల్పవృక్ష వాహనంపై కొలువుదీర్చారు. అనంతరం మంగళవాయిద్యాలు, బాణసంచా నడుమ పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. ఇంటింటా మహిళలు స్వామి, అమ్మవారికి కర్పూర హారతులు ఇచ్చారు. కార్యక్రమాన్ని ఆలయ కమిటీ చైర్మన్ లారీమోహన్ పర్యవేక్షించారు.

కార్వేటినగరం: మండలకేంద్రంలోని టీటీడీ అనుబంధంగా ఉన్న ప్రముఖ వేణుగోపాలస్వామి ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా జరిగాయి. గురువారం వేకువజామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి శుద్ధి, తోమాల, కొలువు, అర్చన తదితర నిత్యకైంకర్యాలను చేపట్టారు. అనంతరం మూలవిరాట్‌ను పట్టువస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం 10 నుంచి 11 గంటల వరకు రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఉత్సవమూర్తులకు వేదపండితులు వేదమంత్రాల నడుమ స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం 5.30 నుంచి 6.30 వరకు టీటీడీ పండితులు వేదమంత్రాల నడుమ ఆస్థానం, పురాణ పఠనం నిర్వహించారు. అనంతరం రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలుడు తిరుచ్చిపై ఆశీనులై ఆలయ మాడవీధుల్లో విహరించారు. భక్తులు కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

అలరించిన నృత్యనివేదన ..

ఏటా బొబ్బిలి వంశస్తులైన బొబ్బిలి రంగారావు దత్తపుత్రుడు బొబ్బిలి ప్రసాద్ వేణుగోపాల స్వామి కోవెలలో చేసిన నాట్యం భక్తులను ఎంతో ఆకట్టుకుంది. ఏటా తన వంశస్తులు మొక్కుబడి ప్రకారం కృష్ణాష్టమి నాడు తన నృత్యప్రదర్శన చేయడం ఆనవాయితీ అన్నారు. నాట్యాన్ని తిలకించడానికి పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడం విశేషం. కార్యక్రమంలో టీటీడీ డిప్యూటీ ఈఓ నాగరత్న, ఏఈఓ పార్థసారథి, సూపరింటెండెంట్ రమేష్‌బాబు, ఆలయ అధికారి సురేష్‌కుమార్, టీటీడీ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురంలో..

శ్రీరంగరాజపురం: మండలవ్యాప్తంగా గ్రామాల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్షీరసముద్రం గ్రామంలో వెలసిన శ్రీకృష్ణ ద్రౌపదీ సమేత ధర్మరాజుల సన్నిధిలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు దర్శనం కల్పించారు. అలాగే భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఆలయంలో చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం గ్రామ పురవీధుల్లో స్వామివారిని ఊరేగించారు. కార్యక్రమంలో ఉభయదారులుగా క్షీరసముద్రం గ్రామస్తులు పాల్గొన్నారు.

కార్వేటినగరంలో..

కార్వేటినగరం: మండల పరిధిలోని శీకాయపట్టెడ గ్రామంలో వెలసిన శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో గురువారం గోకులాష్టమి వేడుకలను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని పట్టువస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. రాత్రి స్వామివారిని ప్రత్యేక వాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. స్వామివారిని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మండల కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ పురంధర్, ఉప సర్పంచ్ జయకుమార్, మాజీ సర్పంచ్ ధర్మయ్య, సింగిల్‌విండో మాజీ డైరెక్టర్ రామిరెడ్డి తదితరులు దర్శించుకున్నారు.

వెదురుకుప్పంలో..

వెదురుకుప్పం: మండలంలోని కొమరగుంట పంచాయతీ బందార్లపల్లె గ్రామంలో ఉన్న రుక్మిణీ సమేత రాధాకృష్ణ ఆలయంలో గురువారం గోకులాష్టమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా వేకువజామునే సుప్రభాత సేవతో స్వామివారికి మేల్కొలిపి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. ఉదయం 9 గంటలకు విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం గోపూజ, గోప్రదక్షిణ కార్యక్రమాలు జరిగాయి. అనంతరం స్వామివారికి స్నపన తిరుమంజనం సేవ చేపట్టారు. తదుపరి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన పెళ్లిపందిరిలో స్వామివారి ఉత్సవమూర్తులను వేంచేపు చేసి కల్యాణానికి సిద్ధం చేశారు. పట్టు పీతాంబరాలు, ఆభరణాలతో ఉత్సవర్లను సర్వాంగ సుందరంగా అలంకరించారు. సకల దేవతలకు ఆహ్వానం పలుకుతూ శాస్త్రోక్తంగా వైభవంగా కల్యాణోత్సవం నిర్వహించారు. అన్నమయ్య సంకీర్తనలు ఆకట్టుకున్నాయి. భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు మునిచంద్రారెడ్డి, సచివాలయ కన్వీనర్ జగదీశ్ రెడ్డి పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో బాబా

పుత్తూరురూరల్‌లో..

పుత్తూరు రూరల్: స్థానిక షిర్డీసాయి మందిరంలో గురువారం కృష్ణుడి రూపంలో బాబా భక్తులకు దర్శనమిచ్చారు. కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా ఉదయం బాబాకు మహా అభిషేకం నిర్వహించారు. భగవద్గీత పారాయణం చేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం బాలకృష్ణుడి ఊంజల్‌సేవ కనుల పండువగా నిర్వహించారు. రాత్రి 8.30 గంటలకు పవలింపు సేవ నిర్వహించారు. విశేషసంఖ్యలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ముత్యాలమ్మ ఆలయంలో ..

పెనుమూరు(కార్వేటినగరం): మండల కేంద్రం పెనుమూరులో వెలసిన శ్రీముత్యాలమ్మ ఆలయంలో గురువారం సమరతా సేవా ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముత్యాలమ్మ ఆలయ ఆవరణలో శ్రీకృష్ణుని చిత్రపటాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. మధ్యాహ్నం చిన్ని కృష్ణుడు, గోపికల వేషధారణలో వచ్చిన పిల్లల చేత ఉట్టి కొటించారు. కార్యక్రమంలో సమరత సేవా ఫౌండేషన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



కృష్ణుడిగా దర్శనమిస్తున్న బాబా



రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం



నృత్యం చేస్తున్న బొబ్బిలి వంశానికి చెందిన ప్రసాద్



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఉభయదారులు







శీకాయపట్టెడలో వేణుగోపాల స్వామిని దర్శించుకుంటున్న నాయకులు, ప్రత్యేక అలంకరణలో స్వామివారు, మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

మధ్యాహ్న భోజనం తనిఖీ

గంగాధరనెల్లూరు : మండలంలోని వింజం పంచాయతీ ఎస్ఎస్ కొండ జెడ్పీ హైస్కూల్‌లో జగనన్న గోరుముద్ద పథకంలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని గురువారం ఎంపీడీఓ శ్రీదేవి, ఎంఈఓ ఆంజనేయులు శెట్టి తనిఖీ చేశారు. విద్యార్థుల కోసం తయారు చేసిన భోజనాన్ని ఎంపీడీఓ శ్రీదేవి రుచి చూశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నడూ లేనివిధంగా నాడు–నేడు పథకంలో భాగంగా ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ స్కూళ్లను అభివృద్ధి చేసిందన్నారు. మౌలిక వసతులు, విద్యార్థులకు రోజూ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం, ఉడికించిన గుడ్డు, చిక్కీ, రాగిజావ తదితర పౌష్టికాహారాలతో కూడిన భోజనం అందిస్తోందని తెలిపారు. మధ్యాహ్న భోజనం పథకంలో ఏవైనా లోటుపాటు ఉన్నట్లయితే వెంటనే ఎంపీడీఓ, ఎంఈఓకు ఫిర్యాదు చేయాలని సూచించారు. అనంతరం వారు మధ్యాహ్న భోజనం ఎలా ఉందని విద్యార్థులకు ప్రశ్నించగా, చాలా బాగుందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రామక్క, కమిటీ చైర్మన్ మురళి, నాయకులు గోవిందమ్మ, భానుచంద్రారెడ్డి పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనాన్ని రుచి చూస్తున్న ఎంపీడీఓ శ్రీదేవి, ఎంఈఓ ఆంజనేయులు శెట్టి

మిత్ర పురుగుల నిష్పత్తి ఎక్కువగా ఉండాలి

కార్వేటినగరం: పంట సస్యరక్షణలో దిగుబడికి దోహదం చేసే మిత్ర పురుగులు అధికంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఏఓ హేమలత అన్నారు. గురువారం మండలంలోని డీఎంపురం ఆర్బీకే పరిధిలోని కేఎంపురం గ్రామ సమీపంలో రైతులకు పొలంబడి కార్యక్రమం నిర్వహించి ఖరీఫ్ సీజన్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ పంట సాగులో శత్రు పురుగుల కన్నా మిత్ర పురుగులు అధికంగా ఉంటే ఎటువంటి సస్యరక్షణ చర్యలు అవసరం లేదన్నారు. లింగకర్షక బుట్టలు, పసుపు జిగురు పళ్లాలు సమగ్ర పంట సస్యరక్షణ ప్లాట్‌లో ఉంచడం వల్ల కాండం తొలుచు రెక్కపురుగులు, ఆకుముడత రెక్కపురుగు, సుడిదోమ లాంటి శత్రు పురుగులు ఉధృతిని గమనించి సస్యరక్షణ చర్యలు చేపట్టవచ్చన్నారు. అనంతరం రైతులకు సస్యరక్షణపై ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓలు గాయత్రి, హేమాద్రి, ఆర్బీకే సిబ్బంది మునికృష్ణ, కుసుమ, ప్రసన్న, రైతులు దాముర్‌రెడ్డి, నటరాజరెడ్డి, సోమశేఖర్, భూపాల్, రాజేష్, సంపత్‌రెడ్డి పలువురు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ హేమలత

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

పుత్తూరు రూరల్: చిరుధాన్యాలైన కొర్రలు, రాగులు, సజ్జలు, జొన్నలతో కూడిన ఆహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని సీడీపీఓ కె.పద్మజ సూచించారు. గురువారం స్థానిక కామరాజ్‌నగర్, బలిజ స్ట్రీట్ అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు చిరుధాన్యాలు, ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవడం ద్వారా రక్తహీనతను అధిగమించవచ్చని చెప్పారు. అలాగే రోగ నిరోధక శక్తిని పెంపొందించుకోవచ్చని వివరించారు. ఆహారం ఎలాంటి వంట పాత్రల్లో వండుకోవాలి ? రోజువారి ఆహారంలో ఏవి తీసుకోవాలన్న విషయాలను తెలియజేశారు. కుటుంబంలోని ప్రతి ఒక్కరికీ పోషకాలు అందేవిధంగా ఐదు రంగుల్లోని కూరగాయలను తీసుకోవాలని సూచించారు. ఎరుపు, పసుపు, ఆకుపచ్చ, తెలుపు, నారింజ రంగులు వంటల్లో ఉండేలా చూసుకోవాలని వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ కిట్‌లోని ఆహార పదార్థాలను క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు గీతాంజలి, సంధ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు అంబిక, ఈశ్వరి, దుర్గ, మహిళలు పాల్గొన్నారు.



మహిళలకు సూచనలు ఇస్తున్న సీడీపీఓ పద్మజ

మెనూ ప్రకారం భోజనం అందించండి

పాలసముద్రం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం పెట్టాలని ఎంఈఓ రాజేంద్రప్రసాద్ తెలిపారు. గురువారం బలికంద్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని ఆయన రుచి చూశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన కూరగాయలతో చేసిన భోజనంతో పాటు చిక్కీ, గుడ్డును ప్రతిరోజు సక్రమంగా అందించాలని తెలిపారు. బియ్యాన్ని మంచి నీటితో కడిగిన తరువాతే అన్నం చేయాలన్నారు. రసం, సాంబారులో అయోడిన్ ఉప్పు, తాజా కూరగాయలనే వాడాలని సూచించారు. ముఖ్యంగా హెచ్ఎం విద్యార్థుల హాజరును ఆన్‌లైన్‌లో త్వరగా పెట్టాలని తెలిపారు. అనంతరం విద్యార్థులకు చేసిన సాంబారు, రసం రుచి చూశారు. ఆయన వెంట హెచ్ఎం మనోహర్ నాయుడు పాల్గొన్నారు.



విద్యార్థులకు చేసిన సాంబారు, రసం పరిశీలిస్తున్న ఎంఈఓ రాజేంద్రప్రసాద్

కాలభైరవుడికి పుష్పాలంకరణ

నగరి: పట్టణ పరిధిలోని శ్రీకామాక్షీ సమేత కరకంఠేశ్వర ఆలయంలోని శ్రీ కాలభైరవ స్వామికి గురువారం అష్టమి పూజల్లో భాగంగా పుష్పాలంకరణ చేశారు. ఈ అలంకరణ భక్తులను అమితంగా ఆకట్టుకుంది. అష్టమి పూజలను పురస్కరించుకుని కాలభైరవ స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేపట్టారు. స్వామికి పాలు, పెరుగు పంచామృతంతో అభిషేకించారు. అనంతరం పుష్పాలతో స్వామివారిని అలంకరించగా, భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రసాదాలు స్వీకరించారు.



పుష్పాలంకరణలో శ్రీ కాలభైరవ స్వామి

ఉపాధిహామీ పనుల పరిశీలన



ఉపాధిహామీ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పాలసముద్రం : మండల పరిధిలోని జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పనులను నాణ్యతగా చేపట్టాలని ఎంపీడీఓ ప్రేమ్‌రాజ్ కుమార్ తెలిపారు. గురువారం శ్రీకావేరిరాజుపురం, పాలసముద్రం పంచాయతీల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఆయన ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతూ కూలీలకు గిట్టుబాటు వచ్చేవిధంగా మార్కింగ్ ఇచ్చిన తరువాతనే కూలీలతో పనులు చేయించాలన్నారు. ముఖ్యంగా పనులు నాణ్యతగా చేపట్టాలని సూచించారు. ఫీల్డ్‌అసిస్టెంట్లు జాబ్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి 100 రోజులు పనులు కల్పించాలని తెలిపారు. అనంతరం మస్టర్‌ను పరిశీలించి కూలీల పేర్లు చదివి హాజరు వేశారు. ఆయన వెంట ఏపీఓ మార్గరెట్ పాల్గొన్నారు.

గ్రామోత్సవంలో అవనాక్షమ్మ

నారాయణవనం: మండలంలోని సముదాయంలో వెలసిన టీటీడీ అనుబంధంగా ఉన్న అవనాక్షమ్మ ఆలయ వార్షిక ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి అమ్మవారు పురవీధుల్లో విహరించారు. ఉదయం ఆలయంలో అర్చకులు నిత్య పూజా కైంకర్యాలను పూర్తి చేశారు. అనంతరం అమ్మవారికి సర్కారు అభిషేకం నిర్వహించి, సుగంధ పుష్పాలతో సుందరంగా అలంకరించారు. పరిసర గ్రామాల మహిళలు పొంగళ్లు పెట్టి, పిండి దీపాలతో నైవేద్యం సమర్పించారు. సాయంత్రం అమ్మవారు సముదాయం, నారాయణవనం పురవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఈ సందర్భంగా మహిళలు హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఈకార్యక్రమాల్లో టీటీడీ స్థానిక ఆలయాల ఏఈఓ పార్థసారథి, సూపరింటెండెంట్ ఏకాంబరం, ఆలయ అధికారి నాగరాజు, భద్రతా జమేదార్ రాజశేఖర్ పాల్గొని పర్యవేక్షించారు. జాతరలో చివరి రోజైన శుక్రవారం ఉదయం 5 గంటలకు అమ్మవారికి ప్రత్యేక అభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారి నాగరాజు, అర్చకులు పన్నీర్‌సెల్వం తెలిపారు. సాయంత్రం విశేష అలంకరణలో అమ్మవారు సముదాయం, కీళగరం, నారాయణవనం పురవీధుల్లో విహరిస్తారని చెప్పారు.



భక్తులను కటాక్షిస్తున్న అవనాక్షమ్మ అమ్మవారు

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

కార్వేటినగరం: అర్హులైన ప్రతి పేదవాడికి పక్కాగృహాలు మంజూరు చేయాలని, ఎస్టీ కాలనీల్లో సమస్యలు పరిష్కరించాలని జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ అన్నారు. గురువారం ఆయన మండల పరిధిలో సూరయ్యపాళెం ఎస్టీ కాలనీని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ఆదేశాల మేరకు హౌసింగ్ అధికారులతో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా అర్హులైన ప్రతి ఒక్కరిని గుర్తించి పక్కాగృహాలు అందించాల్సిన బాధ్యత హౌసింగ్ అధికారులపై ఉందన్నారు. గతవారం డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఈ గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించినప్పుడు గ్రామస్తులు పలు సమస్యలను విన్నవించారని తెలిపారు. వీటిపై సత్వరమే స్పందించిన మంత్రి సూరయ్యపాళెం ఎస్టీకాలనీలో అర్హులను గుర్తించి ఇళ్లపట్టాలు, పక్కా గృహ నిర్మాణాలతో పాటు ఎస్టీలు అనుభవంలో ఉంటున్న భూములకు పట్టాలు అందించాలని ఆదేశించినట్లు గుర్తు చేశారు. పెళ్లి అయిన వారిని విధిగా గుర్తించి రేషన్‌కార్డులు అందించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేవిధంగా చూడాలని రెవెన్యూ అధికారులకు తెలిపారు. అదేవిధంగా ఇళ్లపై వెళ్తున్న విద్యుత్ తీగలను తొలగించాలని విద్యుత్ ఏఈ రియాజ్‌కు తెలిపారు. అనంతరం ఎస్టీకాలనీలో పర్యటించి పలు సమస్యలను పరిష్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కార్తీక్ రెడ్డి, సర్పంచ్‌లు ధనశేఖర్‌వర్మ, శేఖర్‌రెడ్డి, లోకనాథ నాయుడు, నాయకులు ధన్‌రాజ్, అర్జునయ్య, హౌసింగ్ ఏఈ యోగేంద్రనాయుడు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ

భజనమండలి స్థాయి పెరగాలి

నగరి : సత్యసాయి భజన మండలి స్థాయి పెరగాలని శ్రీ సత్యసాయి సేవా ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షుడు శ్రీ మధుసూదన్ అన్నారు. గురువారం మండలంలోని తడుకుపేట, శ్రీసాయి శివాలయంలో గోపూజ, అష్టోత్తర పూజలు, భజన నిర్వహించి, మహా మంగళహారతి అనంతరం 504 మంది భక్తులకు అన్న ప్రసాదం చేశారు. ఈ సందర్భంగా సత్యసాయి భజన మండలి సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాయిభజన మండల స్థాయి నుంచి సమితి స్థాయికి ఎదగాలని స్వామిని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. బాల వికాస్ తరగతులు నిర్వహించి భజన మండలికి పూర్వ వైభవం తీసుకు రావాలన్నారు. మొక్కలు నాటడంపై సభ్యులు శ్రద్ధ చూపాలని సూచించారు. ఈ నెలలోనే రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి వ్యాసరచన పోటీలను ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల, డిగ్రీ, ఇంజినీరింగ్ విద్యార్థులకు విడివిడిగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు అధికసంఖ్యలో పాల్గొనే విధంగా విద్యాసంస్థలకు వెళ్లి సంప్రదించాలన్నారు. అనంతరం లిఖిత నామ జప పుస్తకాలను భక్తులకు పంపిణీ చేశారు. సమావేశంలో జిల్లా పదాధికారులు, యూత్ సాయిచేతన్, రమేష్, నవీన, తడుకుపేట కన్వీనర్, ఓ.వెంకర రమణ, సభ్యులు, బాల వికాస్ గురువు శ్రీదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.



అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

